మాదకద్రవ్యాల నుంచి పిల్లలను రక్షించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

అడ్డగుట్ట: మద్యం, మాదకద్రవ్యాల నుంచి పిల్లలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని మద్యం, మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్లో మద్యం, మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలందరూ ఏదో ఒక మాదకద్రవ్యానికి బానిసలై వారి బాల్యాన్ని కోల్పోదుతన్నారాన్నారు. తల్లిదండ్రులు, నాయకులు ప్రతీ ఒక్కరూ పిల్లల కోసం సమయం కేటాయించి వారి బాగోగులు తెలుసుకొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ శాతం పిల్లలు క్రేన్ వక్క పొడి, స్వీట్ సుపారీతో మొదలై పాన్, గుట్కా, సిగరెట్, గంజాయి వంటి వాటికి అలవాటు పడుతున్నారని తెలిపారు. ఈ గంజాయి పబ్బుల నుంచి పల్లెటూర్ల వరకు వ్యాపించిందని, బడాబాబుల నుంచి బలహీనుల వరకు చేరుతుందన్నారు. ఈ క్రమం మాదకద్రవ్యాలను నియంత్రించకపోతే మానవ మనుగడకే ఒక పెను ప్రమాదం అవుతుందన్నారు. ప్రతీ పాఠశాల, బస్తీలలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయాలని, అధికారులు బస్తీలలో వ్యాపారం చేసే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ అడ్వైజర్ అజయ్‌బాబు, సీఆర్పీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ, జిల్లా కోకన్వీనర్ రమాదేవి, మదర్స్ కమిటీ శోభ, రామలీల, బాలమణి, ఆర్. మల్లేష్, కాంపల్లి శ్రీనివాస్, పుష్ప, గోపి, కౌసల్య, శ్రీనివాస్, వరలక్ష్మి, దివ్య, ఎంవి ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య, సుమలత, సౌజన్య, లావణ్య పాల్గొన్నారు.

జెక్‌కాలనీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టండి



సనత్‌నగర్: జెక్‌కాలనీ సమస్యలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. కాలనీలో పాడైపోయిన రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలంటూ అధికారులను ఆదేశించారు. జెక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ మల్లు ప్రసాద్ నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చందు, ప్రతినిధులు సుబ్బరాజు, శివారెడ్డి, విశ్వనాథరాజు, వెంకట్ సోమ, లక్ష్మారెడ్డి తదితరులు శనివారం డిప్యూటీ సీఎంను కలిశారు. కాలనీలోని 3,4 వీధులతో పాటు సెంట్రల్ రహదారి పాడైపోయిందంటూ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయా రోడ్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించడంతో ఫెడరేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఈ రోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.86 లక్షలు మంజూరు చేయగా, ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అయినప్పటికీ అధికారులు పనులు చేపట్టడంలో జాప్యం చేస్తూ రావడంతో వారు విషయాన్ని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

ముగిసిన జాతీయ సదస్సు



సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ డైమెన్షన్స్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన చర్చావేదికలో విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ, పర్యావరణ, సాంకేతిక తదితర అంశాలపై పలువురు నిపుణులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి జాతీయ విద్యా విధానం-2020 ప్రాధాన్యతను వివరించారు. ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన వైపు అడుగులు వేయాలన్నారు. తమ సంస్థ ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని అందుకోవాలని సూచించారు. ప్రముఖ పర్యావరణవేత్త, రాజనీతి శాస్త్రజ్ఞులు ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ఉత్తర భారతదేశంలోని హిమాలయాల నుంచి దక్షిణ భారత సముద్రాల వరకూ పర్యావరణం కలుషితమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

25, 26న విద్యార్థుల సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 25, 26 తేదీల్లో విద్యార్థుల సదస్సు జరగనున్నట్లు ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి ఆజాద్ తెలిపారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో ఏర్పాటు చేసిన సన్నాహక కార్యక్రమంలో సదస్సు విజయవంతం కోసం రూపొందిన వాల్ పోస్టర్‌ను ప్రిన్సిపాల్ ప్రొ.గణేష్, ఖమ్మం డాక్టర్ గోపీనాథ్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఆవిష్కరించారు.

రాజెల్లయ్య సేవలు చిరస్మరణీయం



రాజెల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించిన డప్పు మల్లికార్జున్, రవి

బన్సీలాల్‌పేట్: సామాజిక ఉద్యమకారుడు రాజెల్లయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి రాజెల్లయ్య మాదిగ జయంతి కార్యక్రమాన్ని శనివారం బన్సీలాల్‌పేట్ డీ-క్లాస్ అంబేడ్కర్ యువజన సంఘంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మర్రి పురురవరెడ్డి, బీజేపీ నాయకురాలు స్పందన, కార్పొరేటర్ హేమలత, నాయకులు లక్ష్మీపతి, రాజేందర్, మహేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు మల్లికార్జున్ మాదిగ, సాంసంగ్, రవి, టీవీ నర్సింహ్మారావు మాదిగ హాజరై రాజెల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. రాజెల్లయ్య నడిపిన పోరాటాన్ని, పద్మశ్రమను, చేసిన త్యాగాన్ని, ఎన్నటికీ మరవనివన్నారు. బన్సీలాల్‌పేట్ అంబేడ్కర్ యువజన సంఘం భవనానికి దివంగత నేత కె. రాజెల్లయ్య స్మారక భవనంగా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజెల్లయ్య సతీమణి భాగ్య, నాయకులు గుంటి సత్యనారాయణ, ఈశ్వర్, రాము, కుమార్, అశోక్, శ్రీనివాస్ ప్రేమ్, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

4100 మందికి సీపీఆర్‌పై ఉచిత శిక్షణ



గాంధీఆస్పత్రి : గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్, జనహిత సేవట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ అలుమ్నీ ఎడ్యుకేషన్ సెంటర్‌లో నిర్వహించిన సీపీఆర్ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో 4100 మంది వైద్య విద్యార్థులు, నర్సింగ్, ఎన్‌సీసీ కేడెట్లు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, వలంటీర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సీపీఆర్ ఉచిత శిక్షణ అందించినట్లు అలుమ్నీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, ఏఆర్ రత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్ ప్రతినిధులు డాక్టర్ రాజశేఖర్ కొల్లిపర, రవీందర్ సురకంటి, వేమూరి మూర్తి, మహేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సన్నీడేవిస్, అమెరికా హార్ట్ అసోషియేషన్ ప్రతినిధి డెన్నీస్ మెకాలే పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సనత్‌నగర్: ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ హాస్పిటల్ సహకారంతో మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్లో జరిగిన వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్లు మమత కస్తూరి, పద్మావతి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ నర్మద, మెడికల్ ఆఫీసర్లు గీత, మంజుల, ఫార్మాసిస్టులు పెరిన్‌దేవి, సుమలత, ఎంఎస్ఓ ఈశ్వర్‌బాబుల బృందం వైద్య సేవలను అందించారు. దాదాపు 200 మంది వరకు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మోడల్‌కాలనీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబులు శిబిరం ఏర్పాట్లు చేశారు.

చిన్నారుల్లోని మేధస్సును వెలికితీయాలి

అమీర్‌పేట: పిల్లల్లో దాగి ఉన్న మేధస్సును వెలికితీయాలని ఆర్అండ్‌డీ.చీఫ్ సౌత్ కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్ బిశ్వజీత్ చౌబెయ్ అన్నారు.జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేటలోని ఎస్ఆర్‌నగర్ రవీంద్రభారతి స్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్ పోను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను ఆయన పరిశీలించి అభినందించారు. డీఆర్‌డీవో మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ చీఫ్ డాక్టర్ పద్మావతి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, డీన్ శ్రీదేవి, డీఐ.మధు, ప్రిన్సిపాల్ సరిత పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లిన విద్యార్థినులు అదృశ్యం



అక్షిత



ప్రసన్న

అడ్డగుట్ట: పాఠశాలకు వెళ్లిన ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. అడ్డగుట్ట బీ-సెక్షన్‌కు చెందిన అక్షిత(15) వారాసిగూడకు చెందిన ప్రసన్న(15) అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. ఈ నెల 9న ఉదయం పాఠశాలకు వెళ్లిన అక్షిత, ప్రసన్న రాత్రైనా ఇళ్లకు వెళ్లలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పాఠశాల వద్దకు వెళ్లి ఆరా తీయగా పాఠశాల ముగిసిన వెంటనే అక్షిత తన స్నేహితురాలు ప్రసన్నతో కలిసి వెళ్లిపోయిందని మరో విద్యార్థి చెప్పింది. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఇరు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యమకారులకిచ్చిన హామీలు నెరవేర్చాలి



అనంత జనార్దన్‌రెడ్డి

బౌద్ధనగర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి ప్రధాన కార్యదర్శి అనంత జనార్దన్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటినుంచి తెలంగాణ సిద్ధించేంత వరకు తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి(టీపీయూఎస్) తొలి దశ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమ గమనంలో భాగమైందని తెలిపారు. ఎన్నో ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా తెలంగాణ కోసం ఏ సంస్థ, ఉద్యమ నాయకుడు, ఎవ్వరు పిలుపునిచ్చినా దాన్ని సొంత కార్యక్రమంగా భావించి ఉద్యమాల్లో పాల్గొన్నామని వివరించారు. అలాంటి ఉద్యమ గొంతులను గుర్తించి ఉద్యమకారులను ఆదుకునేలా ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 250 గజాల స్థలం, పెన్షన్, బస్‌పాస్, ఆర్థికసాయం, జీవనోపాధికి సంబంధించి ఐడీ కార్డులు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

విగ్రహ పరిసరాల సుందరీకరణ పట్ల హర్షం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే సుభాష్ చంద్రబోస్ విగ్రహం చుట్టూ సుందరీకరించేందుకు నిధులు కేటాయించడం పట్ల టీడీపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ కార్యదర్శి గౌరిశంకర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన పార్కు పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. పార్కు పరిసరాలు అధ్వానంగా మారడంతో తాము గతేడాది జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకు రాగా స్పందించి జీహెచ్ఎంసీ బడ్జెట్ నుంచి రూ.85వేలు నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్, ఉప కమిషనర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

14న క్షీరాభిషేకం



రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 14వ తేదీన వసంత పంచమి సందర్భంగా క్షీరాభిషేకం నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభ్యులు ఎస్ఎస్ కుమారి, వీరలక్ష్మి, అన్నపూర్ణ, ప్రభావతి మాట్లాడారు. సత్సంగ్ కమిటీ ప్రెసిడెంట్ బొగ్గారపు విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో 108 లీటర్ల పాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. 14, 15వ తేదీల్లో అమ్మవారు సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తారన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సనత్‌నగర్: గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గంగాధర్ వివరాల ప్రకారం..బేగంపేట బాలంరాయి కమాన్ వద్ద ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని సదరు వృద్ధుడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పీవీకి భారతరత్నపై హర్షం

లాలాపేట: దేశ మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావుకు భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రకటించడంపై ప్రకాశం ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ వైస్ చైర్మన్ డా. పి. మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణల పితామహుడు, ప్రముఖ రాజనీతజ్ఞుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదుడు, తెలుగు జాతి బిడ్డకు దక్కిన ఈ గౌరవాన్ని తెలుగు ప్రజలందరికి దక్కినట్లుగా భావిస్తున్నారని పేర్కొన్నారు. ప్రముఖ ఉస్మానియా యూనివర్సిటీలో విద్యనభ్యసించిన పీవీ బహుభాషా కోవిదుడిగా తెలుగు, హిందీలో భాషల్లో ఎన్నో కవితలు రాశారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు.

పాలాభిషేకం

ఉస్మానియా యూనివర్సిటీ: సేవాలాల్ మహారాజ్ జయంతి 15న రాష్ట్ర ప్రభుత్వం ఐచ్ఛిక సెలవుగా ప్రకటించడం పట్ల టీజీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఓయూలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్ల పెంపు,పోడుభూముల పట్టాలతో పాటు అనేక అంశాలలో గిరిజనులను మోసగించినందన్నారు. ఇదిలా ఉండగా 15న సెలవు ప్రకటించినందుకు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

దివ్యాంగులకు అవకాశాలిస్తే అద్భుతాలే



విద్యార్థులతో గవర్నర్ తమిళిసై

కంటోన్మెంట్: దివ్యాంగులకు తగిన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ అన్నారు. బోయిన్‌పల్లిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టీపుల్ డిజిబులిటీస్ (దివ్యాంగ్జన్)లో నిర్వహించిన కళాశక్తి కార్యక్రమానికి గవర్నర్ హాజరై మాట్లాడారు. మానసిక, శారీరకంగా సంపూర్ణ ఆరోగ్యం కలిగిన వారిలోనూ ఎందరో సోమరితనంతో తగిన రీతిలో రాణించడం లేదన్నారు. జన్యుపరంగా లోపం కలిగినప్పటికీ వివిధ అంశాల్లో అద్భుతంగా రాణిస్తున్న దివ్యాంగులను చూసి ఇలాంటి వారు నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు.దివ్యాంగ్జన్ సంస్థ ప్రతినిధులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ్జన్ డైరెక్టర్ రామ్‌కుమార్, అధికారులు శ్రవణ్ రెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



చైతన్యలక్ష్మి

లాలాపేట: ఓయూ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తమ్ కుమార్తె ఇటికాల చైతన్య లక్ష్మీకి ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్ వరించింది. ప్రొఫెసర్ అవినాష్ జైస్వాల్ పర్యవేక్షణలో 'విభూతి నారాయణ్ కే కథా సాహిత్య మే యుగ్ బోధ్' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో డాక్టరేట్ వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తుల స్వీకరణ

రాంగోపాల్‌పేట్: 200 యూనిట్లు లోపు విద్యుత్‌ను వినియోగించే గృహజ్యోతి పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శనివారం క్లాక్ టవర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కుమ్మరిగూడ రాజరాజేశ్వరీ దేవాలయం, రెజిమెంటల్‌బజార్‌లోని పరికిబస్తీ, ఆదయ్యనగర్‌లోని లైబ్రరీల్లో ఎస్పీఎం ఏడీఈ యాదయ్య, ఏఈ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఆధార్, ఆహార భద్రత కార్డు, 6 గ్యారంటీ పథకాల్లో దరఖాస్తు చేసిన రసీదు, ఫోన్ నంబర్‌తో దరఖాస్తులను అందించాలని డీఈ యాదయ్య తెలిపారు. ఇంకెవరైన ఉంటే ప్యారడైజ్ ఈఆర్‌వో కార్యాలయంలో అందించాలన్నారు.

'పీవీ' మ్యూజియాన్ని ఏర్పాటు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత మాజీ ప్రధాని, ఓయూ పూర్వ విద్యార్థి పీవీ నర్సింహరావు మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని ఓయూ జేఏసీ కన్వీనర్ తల్లమల్ల శ్వేతహాసేన్ పేర్కొన్నారు. పీవీ చదివే రోజుల్లో వసతి ఉన్న బీ-హాస్టల్ (క్రిష్ణవేణి) ప్రస్తుతం మూతపడిందని ఆ భవనాన్ని మరమ్మతులు చేయించి అందులోనే మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలన్నారు. శతాబ్ది ఉత్సవాలు పూర్తి చేసుకొని 106 ఏళ్ల ఓయూలో సుమారు కోటి మందిగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించారన్నారు. పీవీ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డుకు ఎంపిక చేయడం ఓయూకే గర్వకారణమన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

లాలాపేట: దేశ వ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు బెజ్జాల కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం లాలాపేట, తార్నాక ప్రాంతాల్లో బంద్‌కు సంబంధించిన ప్రచార కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలన్నారు.

రైలు ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి

అడ్డగుట్ట: రైలు ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన తాళ్లపల్లి రాజయ్య(65) రైల్వే రిటైర్డ్ ఉద్యోగి. ఈ నెల 9న ఉదయం 6.30 సమయంలో తన ఇంటి సమీపంలోని హోటల్ వద్దకు వెళ్లి టీ తాగి వస్తున్న క్రమంలో ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మెరుగైన సమాజంగా తీర్చిదిద్దాలి

అమీర్‌పేట: ప్రజలు జీఎస్టీని పాటించి సమాజాన్ని మెరుగైన సమాజంగా తీర్చిదిద్దాల్సిన అవసరముందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్ జస్టిస్ చల్లా కోదండరామ్ అన్నారు.తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం అమీర్‌పేట గ్రీన్‌పార్క్ మారీ గోల్డ్ హోటల్‌లో జీఎస్టీ, గ్లోబలైజేషన్‌పై కాన్క్లేవ్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరామ్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకీకృత పన్ను విధానంతో 11 ఏళ్లు పూర్తి చేసుకున్న జీఎస్టీ దేశాన్ని ఏకం చేసిందని తెలిపారు. మెరుగైన సమ్మతి కోసం నియమ రూపకర్తలు తప్పనిసరిగా ఆచరణాత్మక విధానాన్ని కలిగి ఉండాలని సూచించారు. అనేక దేశాలలో జీఎస్టీ రేట్లు 3- 5 శాతం వరకు ఉంటాయని భారత దేశంలో వస్తువులను బట్టి జీఎస్టీ రేటు 5 - 28 శాతం వరకు మారుతుందన్నారు.

లైబ్రరీకి సామగ్రి అందజేత

సనత్‌నగర్: లోధా అపార్ట్‌మెంట్ కాసా సీఎస్ఆర్ టీమ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగర గ్రంథాలయం ఎస్ఆర్‌నగర్ బ్రాంచ్‌కు అవసరమైన సామగ్రిని శనివారం వితరణ చేశారు. పలువురు దాతలు ముందుకొచ్చి 10 ప్లాస్టిక్ చైర్లు, ఏపీపీఎస్సీ, టీఎస్పీఎస్సీ, తెలుగు అకాడమీ, ఎస్సెస్సీ, ఇంజనీరింగ్‌కు సంబంధించిన 72 పుస్తకాలు, 30 రీడింగ్ ప్యాడ్లు, నాలుగు ఫ్యాన్లను అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ హరిబాబు, కాసా సీఎస్ఆర్ కో-ఆర్డినేటర్ కృష్ణమూర్తి, దాతలు అనురాధ, వరప్రసాదరావు గోపరాజు, స్రవంతి, రామాంజనేయులు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. ఓయూ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం వర్సిటీలను నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధ్యాపక ఉద్యోగాల భర్తీతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, కాలేజీ ప్రిన్సిపల్, రాష్ట్ర ఉన్న విద్య మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, విశ్రాంత అధ్యాపకులు ప్రొ.భూపతిరావు, అలుమ్ని అధ్యక్షులు డా.విజయ్‌కుమార్, డా.రమణనాయక్ పాల్గొన్నారు.